క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జామి: మండల కేంద్రం జామిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఇన్‌చార్జి విద్యుత్ శాఖ ఏఈ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యం లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గజపతినగరంలో..

గజపతినగరం: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఇన్ చార్జి ఏఈఆదిత్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టౌన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీవాలకు నట్టల నివారణ మందులు



జీవాలకు నట్టల నివారణ మందులు వేస్తున్న వైద్యసిబ్బంది

లక్కవరపుకోట: గొర్రెలు, మేకల్లో సామూహిక అంతర పరాన్న జీవుల నివారణ (నట్టల) కార్యక్రమంలో భాగంగా ఎల్.కోట పశువైద్య కేంద్రం వైద్యురాలు ఎస్.గాయత్రీదేవి మండలంలోని ఖాసాపేట గ్రామంలో జీవాలకు గురువారం నట్టల నివారణ మందులు వేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ఈనెలాఖరు వరకు నిర్వహిస్తామన్నారు. మండలంలో 25,220 గొర్రెలు, 7,602 మేకలు ఉన్నాయని, వాటిన్నంటికీ ఉచితంగా మందులు వేస్తామన్నారు. నట్టల నివారణ మందుల వల్ల జీవాల్లో మరణాలను నివారించవచ్చని, ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటాయన్నారు.

బూడిపేటలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

గజపతినగరం: మండలంలోని బూడిపేట గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో గురువారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 64 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి పిల్లలకు వైద్య తనిఖీలు చేశారు. ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సత్కారం



విద్యార్థిని ఇందు, తదితరులను అభినందిస్తున్న పెద్దలు, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో ప్రతిభకనబరిచిన పెదనడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని కిలారి ఇందును పాఠశాల ఉపాధ్యా యులు, గ్రామపెద్దలు గురువారం సత్కరించి, అభినందించారు. ఇటీవల జమ్మూ కశ్మీర్ లో నిర్వహించిన 36వ టెన్నీకాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థిని ఇందు మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణపతకం, టీమ్ ఛాంపియన్‌షిప్‌లో రజతపతకం సాధించింది. అలాగే వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.గంగులు, గ్రామపెద్దలు మణిబాబు, సూరప్పడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంపై దాడి



పగిలిన సచివాలయ కిటికీల అద్దాలు, లోపల పడిఉన్నరాళ్లు

గజపతినగరం: మండలంలోని మదుపాడ గ్రామ సచివాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని సర్పంచ్ కె.పైడిపునాయుడు, స్థానికులు తెలిపారు. స్థానికులతో కలిసి సర్పంచ్ పైడిపునాయుడు గురువారం విలేకరులతో మాట్లా డుతూ సచివాలయంపై ఆదివారం రాత్రి రాళ్ల దాడి జరిగిందన్నారు. సచివాలయం పైఅంతస్తులోని సర్పంచ్ గది కిటికీల ను రాళ్లతో పగలకొట్టారని చెప్పారు.స్థానిక మహిళా పోలీస్ ద్వారా గజపతినగరం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించామని, పోలీసులు త్వరగా దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒక నెల ఎగ్గొట్టారు..!

- గర్భిణులు, బాలింతల సంక్షేమంలోనూ వైఫల్యమే..
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు గత నెలలో అందని వంట నూనె
- అక్టోబర్ నెలకు సంబంధించి మాత్రమే అందజేత



పెదమేమలి అంగన్‌వాడీ కేంద్రం -5

గంట్యాడ: గర్భిణులు, బాలింతల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పౌష్టికాహార లోపంతో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గత ప్రభుత్వంలో గర్భిణులు, బాలింతలకు ప్రతీ నెల బెల్లం, వేరుశనగ చెక్కీలు, రాగి పిండి, అటుకులు, కర్జూరంతో పాటు, ఐదు లీటర్ల పాలు, కిలో కందిపప్పు, అర లీటర్ వంట నూనెను ఇంటి వద్దకే అందించే వారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతీ నెల ఏదో ఒక వస్తువు సరఫరాలో జాప్యం చేయడమో లేదంటే పూర్తిగా ఎగేస్తు న్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన వంట నూనెను అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేయకుండా మిగుల్చుకుంది. ఒక నెలలో ఏవైనా సరుకులు సరఫరా చేయకపోతే మరుసటి నెలలో సరుకులు ఇచ్చేటప్పుడు రెండు నెలలవి కలిపి లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా లబ్ధిదారులకు అక్టోబర్ నెలకు సంబంధించి మాత్రమే వంట నూనె పంపి ణీ చేశారు. గత నెలలో ఇవ్వాల్సిన నూనె గురించి అంగన్‌వాడీ కార్యకర్తలను లబ్ధిదారులు అడుగుతుంటే...ప్రభుత్వం ఈనెల వరకే సరఫరా చేసిందని, గత నెలకు సంబంధించి నూనె సరఫరా కాలేదు.. తాము ఎక్కడ నుంచి తెచ్చి ఇచ్చేదని బదులిస్తుండడంతో గర్భిణులు, బాలింతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మిగుల్చుకుంటున్న ప్రభుత్వం

గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 166 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గంట్యాడ మండలంలో 96, బొండపల్లి మండలంలో 70 కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 514 మంది గర్భిణులు, 455 మంది బాలింతలు, 3,483 మంది పిల్లలు ఉన్నారు. సెప్టెంబర్ నెలలో 50 కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన వంట నూనె సరఫరా కాలేదు. ఈ కేంద్రాల పరిధిలోనే గర్భిణులు, బాలింతలు 400మంది వరకు ఉంటారు. వీరికి ఒక్కొక్కరికీ నెలకి అరలీటరు వంట నూనె ఇవ్వాలి. సెప్టెంబర్ నెలలో వంట నూనె సరఫరా చేయక పోవడం వల్ల రూ.24 వేలు వరకు ప్రభుత్వం మిగుల్చుకుంది. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సరుకుల్లో కూడా కోతవిధిస్తూ కూటమి ప్రభుత్వం నిధులు మిగుల్చు కోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సరుకులు సరఫరా చేయడం లేదు



సరుకుల సరఫరా వివరాలను ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దత్తిరాజేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి నెలా రేషన్ సరుకులు సకాలంలో సరఫరా కావడం లేదని కె.కృష్ణాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామసందర్శన కార్యక్రమంలో భాగంగా మండల అధికారులు గురువారం ఆ గ్రామంలో పర్యటించారు. అంగన్‌వాడీ -1, 2 కేంద్రాలను, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను అధికారులు పరిశీలించారు. ఉన్నత పాఠశాలలోని వంట గదిలో సిమెంట్ బస్తాలు నిల్వ ఉంచడంతో ఉపాధ్యాయులపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఎంఈఓ-2 సుధాకర్‌ని పిలిచి తక్షణమే వంట గది నుంచి సిమెంట్ బస్తాలను ఖాళీ చేయించాలని ఆదేశించారు. సర్పంచ్ కర్రి దుర్గ, ఈఓపీఆర్డీ వాణిశ్రీ, పశువైద్యాధికారి దినేష్ పాల్గొన్నారు.

సరఫరా కాలేదు..

కొన్ని కేంద్రాలకు ప్రభుత్వం నుంచి సెప్టెంబర్ నెలకు సంబంధించి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసేందుకు వంట నూనె సరఫరా చేయలేదు. గత నెలకు సంబంధించిన వంట నూనె మరి ఇవ్వరు. అక్టోబర్ నెలకు సంబంధించి మాత్రమే ఇస్తారు.

– డి. ఉమాభారతి, గంట్యాడ ఐసీడీఎస్ పీఓ

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే..



ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గుర్ల గ్రామంలో డయేరియాతో ఆరుగురు మృతి చెందడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయ ణ ఆరోపించారు. చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా వ్యాధి గ్రస్తులను ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.వి.రమణ, గరివిడి సీఐటీయూ నాయకులు అంబల్ల గౌరినాయుడుతో కలిసి గురువారం పరామర్శించారు. రోగులకు మెరుగైన చికిత్స అందజేయాలని, అవసరమైతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని వైద్యులను కోరారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామా ల్లో డయేరియా కేసులు నమోదవుతున్నట్లు వారం రోజుల క్రితమే బయటపడినా నేటికీ పరిస్థితిని చక్కదిద్దలేకపోయారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్ల క్ష్యంగానే చూడాలన్నారు. ప్రభుత్వ వైద్యసిబ్బంది, అధికారుల ఏమయ్యారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు డయేరియా ప్రబలిన గ్రామాల్లో పర్యటించి, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, పారిశుద్ధ్య పనులు చేయించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

బొండపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించా రు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ సీనియర్ సహాయకులు సత్యనారాయణ, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నందెన్న సంబరాలు ప్రారంభం



గౌరీపరమేశ్వరుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో గ్రామస్తులు

కొత్తవలస: మండలంలోని గులివిందాడ గ్రామంలో నందెన్న నవరాత్రి సంబరాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గౌరీపరమేశ్వరుల విగ్రహాల ను, లక్ష్మీదేవికి ప్రతిరూపంగా భావించే వరి దుబ్బును మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతం విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు.

అపార్ తప్పనిసరి



కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ రమణ

లక్కవరపుకోట: పాఠశాలల విద్యార్థులందరికీ అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ఐడీ కార్డు తప్పనిసరి అని, అపార్ రిజిస్ట్రేషన్ నమోదు వేగవంతం చేయాలని స్థానిక కేజీబీవీ(కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయం) ఉపాధ్యాయినులకు జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి కె.వి.రమణ సూచించారు. గురువారం ఆయన కేజీబీవీని సందర్శించారు. వసతిగృహంలో సదుపాయాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వన్ నేషన్ -వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా విద్యార్థులకు 12 అంకెలతో కూడిన డిజిటల్ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. తొలుత 9, 10వ తరగతుల విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్నామని, అపార్ కార్డులోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు జాతీయ స్థాయిలో ఏ విద్యార్థి విద్యకు సంబంధించిన సమాచారం అయినా ఇట్టే తెలిసిపోతుందన్నారు. ఉపకార వేతనా లు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం, ఉద్యోగాల భర్తీ వంటి సందర్భాల్లో ఈ అపార్ ఐడీ కీలకం కానుందన్నారు. కార్డుల రిజిస్ట్రేషన్ ఈ నెలాఖరు పూర్తి చేస్తామన్నారు.ఆయన వెంట ఎంఈఓలు సీహెచ్.కూర్మారావు, బి.శ్రీనివాసరావు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గజపతినగరం: పురిటిపెంటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మెరకముడిదాం: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు



శృంగవరపుకోట: తలారిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు



వేపాడ: అంకాజోస్యులపాలెంలో భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

గజపతినగరం/ బొండపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో గజపతినగరం మండలంలోని పురిటిపెంట రైల్వే న్యూకాలనీలో సీసీ రోడ్డు పనులకు, బొండపల్లి మండలంలోని గొల్లుపాలెం నుంచి కొనిశ గ్రామానికి, మరువాడ నుంచి ఎం.కొత్తవలస వరకు బీటీ రోడ్ల నిర్మాణానికి మరువా డలో గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. పలుగ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్దే లక్ష్యం

శృంగవరపుకోట: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. వినాయకపల్లి, ఎస్.కోట తలారి, ఆలుగుబిల్లి, ధర్మవరం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ రంధి అరుంధతితో కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.5.30 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నామని చెప్పారు. ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని, గుర్ల మండలంలో డయేరియాతో నలుగురు మృతి చెందారన్నారు. వైద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించేలా చూడాలని ఎంపీడీఓ భాస్కరరావును ఆదేశించారు. టీడీపీ నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

జామి మండలంలో..

జామి: మండలంలోని ఎం.కె.వలస, ఏ.ఆర్.పేట, జన్నివలస, వి.ఆర్.పాలెం, శాశనపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీఓ అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేశారు. ఉపాధిహామీ ఏపీఓ కిరణ్మయి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంకాజోస్యులపాలెంలో...

వేపాడ: మండలంలోని అంకాజోస్యులపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు సర్పంచ్ బాలబాబుతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి గొంప కృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ



పంచాయతీ కార్యదర్శి తీరును డీఎల్‌పీఓ మోహన్‌రావుకు వివరిస్తున్న సర్పంచ్ యశోద, వార్డు మెంబర్లు

వేపాడ: మండలంలోని బానాది పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఏ.ఎస్.ఎస్.ఎన్.మూర్తి సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇటీవల ఆగ్రామ సర్పంచ్ కర్రి యశోద ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిపై డీఎల్‌పీఓ మోహన్‌రావు ఆగ్రామ సచివాలయంలో గురు వారం విచారణ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ కార్యదర్శి పంచాయతీ సమావేశం నిర్వహించి 90 రోజులు దాటిపోయిందని, సచివాలయంలో నెల రోజుల క్రితమే ప్రింటర్ పాడైతే నేటికీ మరమ్మతులు చేయించలేదని, పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని డీఎల్‌పీఓ దృష్టికి తీసు కెళ్లా రు. ఈనెల 2వ తేదీన గ్రామసచివాలయంలో నిర్వహించాల్సిన గ్రామసభను సర్పంచ్‌గా తనకు, వార్డు మెంబర్లకు సమాచారం ఇవ్వకుండా వేరేచోట నిర్వహించారని, ఇది పాలక వర్గాన్ని పంచాయతీ కార్యదర్శి అవమా నించడం కాదా అని ప్రశ్నించారు. పంచాయతీ సమావేశం ఎందుకు నిర్వహించలేదని పంచాయతీ కార్యదర్శిని డీఎల్‌పీఓ ప్రశ్నించగా, సర్పంచ్ అందుబాటులో లేరని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇవ్వడంతో వార్డు మెంబ ర్లు అగ్రహం వ్యక్తం చేశారు.గ్రామ సచివాలయానికి ఎదురుగానే సర్పంచ్ ఇల్లు ఉందని, సర్పంచ్ ఎప్పుడూ అందుబాటులోనే ఉంటారని వార్డు మెంబర్లు డీఎల్‌పీఓకు వివరించారు. తక్షణమే ఇన్‌చార్జి కార్యదర్శి స్థానంలో గ్రామాభివృద్ధికి సహకరించే వేరొకరిని నియమించాలని సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ కోట్ని కృష్ణ, వార్డు సభ్యులు జి.వెంకటలక్ష్మి, డి.విజయలక్ష్మి, వి.మంగవేణి, డి.అప్పలనాయుడు, అచ్చియ్యమ్మ గ్రామపెద్దలు గళ్ల రామచంద్రుడు, గళ్ల చినరాము,నక్కవెంకటరమణ, దుద్దు తాతారావు, కన్నంనాయుడు, సర్సింగరావు కోరారు. అనంతరం డీఎల్‌పీఓ గ్రామంలో పర్యటించారు. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేయించాలని, పంచాయతీ సమా వేశం నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శితో పాటు ఈఓపీఆర్డీ రవిశంకర్‌ను ఆదేశించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించాలని సర్పంచ్ పట్టుబట్టడంతో డీఎల్‌పీఓ సచివాలయానికి వెళ్లారు. అక్కడ రికార్డులు లేపోవడంతో పంచాయతీ కార్యదర్శిని ఆరా తీయగా, ఆడిట్‌కు పంపించామని బదులివ్వడంతో వార్డు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని, రెండు రోజుల్లో రికార్డులు పరిశీలించడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



బొండపల్లి: అంబటివలసలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మహరాజన్

బొండపల్లి: వరి పంటను తెగుళ్ల ఆశిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉంటూ, సకాలంలో తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని గజపతినగరం ఏడీఏ కె.మహరాజన్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంబ టివలస రైతుసేవా కేంద్రంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల సాగులో పాటించాల్సిన మెలకువలతో పాటు, చీడపీడలు,తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నివారణ చర్యలు చేపట్టండి

గంట్యాడ: వరి పంటను సుడిదోమ ఆశిస్తోందని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని గాజులరేగ వ్యవసాయ పరిశోధ న స్థానం శాస్త్రవేత్త తేజేశ్వరావు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుడతానపల్లి, పెణసాం గ్రామాల్లో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ మందును పిచికారీ చేయాలని చెప్పారు. ఏఓ బి.శ్యామ్‌కుమార్, సర్పంచ్ అలమండ వాణి, ఎంపీటీసీ వర్రి అర్జునమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

జామి: మండలంలోని జాగరం గ్రామ సచివాలయ వీఆర్‌ఓ నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి సంధ్యకు బదిలీ కావడంతో వారిని తోటి సచివాలయ సిబ్బంది గురువారం సన్మానించారు. వీఆర్‌ఓ నారాయణరావు మండలంలోని ఆర్.బి.పురం సచివాలయానికి, పంచాయతీ కార్యదర్శి సంధ్య దత్తిరాజేరు మండలానికి బదిలీ అయ్యారు.

బంగారమ్మతల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న పురిటిపెంట గ్రామస్తులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో బంగారమ్మతల్లి పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి ఆలయంలో గ్రామస్తులు పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన



జామి: చింతాడ గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సుబ్రహ్మణ్యం

జామి: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నరసింహులు తెలిపారు. మండలంలోని జాగరం గ్రామంలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు.ముందుగా సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం అధ్యక్షతన గ్రామస్తులతో సమావేశమై సమస్యలు తెలుసు కున్నారు.అనంతరం పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఏఓ కిరణ్‌కుమార్,ఎంఈఓ జయశ్రీ, జామి పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్రాజ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొడియాడలో..

గంట్యాడ: మండలంలోని గొడియాడలో అధికారులు గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు.ఎంపీడీఓ రమణమూర్తి, ఈఓపీఆర్డీ భానోజీరావు, వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన



వంటకాలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బూడి శ్రీనివాసరావు, సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురునాయుడు గురువారం పరిశీలించారు. వంటకాలను రుచి చూశారు. రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామంలోని శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.

44 మద్యం సీసాల స్వాధీనం

చీపురుపల్లిరూరల్(గరివిడి): చీపురుపల్లి ప్రధాన రహదారిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నిఎస్ఐ దామోదరరావు తన సిబ్బందితో కలిసి గురువారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు జి.హరిబాబు వద్ద నుంచి 44 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.